
సాక్షి
నిజామాబాద్
బుధవారం, 20, డిసెంబర్, 2023



దివ్యాంగుల గుర్తింపు సర్వే

జిల్లాలో సమగ్ర శిక్ష సహిత విద్యావిభాగం అధికారుల ఆధ్వర్యంలో 18 ఏళ్లలోపు దివ్యాంగుల గుర్తింపు సర్వే ప్రారంభమైంది.

- 8లో ▸



యాసంగి సాగు సాగేదెలా..

లక్ష్మి కాలువ నుంచి నీటి విడుదల చేపట్టక పోవడంతో యాసంగి సీజన్‌లో సాగుపై ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
27.7 /16.1

వాతావరణం

ఆకాశం ఉదయం నుంచి నిర్మలంగా ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

కెనాల్ కట్టపై వరిసాగు పరిశీలన



సాక్షి ఎఫెక్ట్..

ఎడపల్లి (బోధన్) : ఎడపల్లి మండలంలోని తానాకలాన్‌లో అక్రమంగా 46 కెనాల్‌పై పంట పండిస్తున్న రాజారెడ్డి పంట పొలాన్ని ఇరిగేషన్ అధికారిణి రాజేశ్వరి పరిశీలించారు. మంగళవారం 'సాక్షి'లో 'కెనాల్ కట్టపై సాగు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కెనాల్‌ను పరిశీలించారు. వెంటనే అక్రమంగా కెనాల్‌పై పండిస్తున్న పంట వ్యర్థాలను తొలగించాలని రైతుకు సూచించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. సంబంధిత నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఆమె వెంట ఇరిగేషన్ సిబ్బంది ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు



సుభాష్‌నగర్ : బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు పి సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి మంగళవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతును కలిశారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యేలను జిల్లా పాలనాధికారి పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కలెక్టర్‌తో భేటీ సందర్భంగా తమ తమ నియోజకవర్గాల్లో నెలకొన్న ఆయా అంశాలపై ఎమ్మెల్యేలు చర్చించారు. భేటీలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



నిజామాబాద్ నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలు అందరికి అందేలా కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జెడ్పీస్థాయి సంఘ సమావేశాలు జెడ్పీ చైర్మన్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఎక్కడా అవకతవకలు జరుగకుండా చూడాలన్నారు. ప్రొటోకాల్ పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత జీపీలదేన్నారు. పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారికి ఆదేశించారు. ఇసుక క్వారీలు తనిఖీ చేయాలని, అక్రమరవాణాను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ రజిత ఎల్లయ్య యాదవ్, సిరికొండ జెడ్పీటీసీ మాన్‌సింగ్, జెడ్పీ సీఈవో గోవింద్ నాయక్, వ్యవసాయ శాఖ, ఫారెస్ట్, ఉద్యానవన శాఖ, వెటర్నరీ శాఖ, విద్యుత్ శాఖ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ, పీజీ తెలుగు పాఠ్యాంశం బోధించడానికి అర్హులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పీజీ (తెలుగు)తో పాటు పీహెచ్‌డీ, నెట్, సెట్, బోధన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు గురువారం సాయంత్రం 4 గంటలలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆది నుంచి అవే మోసాలు..

- గతంలోనూ పలువురిని ముంచిన ప్రశాంత్
- జల్సాలకు అలవాటు పడి అడ్డదారులు
- ప్రసాద్ ఇల్లునూ కాజేసేందుకు ప్లాన్
- శాశ్వతంగా ఆ కుటుంబాన్ని అడ్డు తొలగించుకునేందుకు కుట్ర
- పక్కా ప్రణాళికతోనే ఆరుగురి హత్య



ప్రశాంత్ అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న ప్రసాద్ ఇల్లు



ప్రసాద్ (ఫైల్)

ప్రశాంత్

ఖలీల్‌వాడి/మాక్లూర్: ఒకే కుటుంబంలోని ఆరుగురిని హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడైన ప్రశాంత్ ఆది నుంచి మోసాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మొదట తన మేనమామ కుంటి లస్మనతోనే ప్రారంభించాడు. బ్యాంకులో మార్టిగేజ్ లోన్ ఇప్పిస్తానని నమ్మబలికి రెండేళ్ల క్రితం మామ దగ్గర నుంచే రూ. 40వేలు తీసుకుని మాక్లూర్‌లోని అర ఎకరం భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అనంతరం గ్రామంలో అశోక్ అనే వ్యక్తి వద్ద నుంచి సైతం మరో అర ఎకరం భూమిని తన పేరిట మార్పించుకుని అమ్ముకున్నాడు. మోసాలు చేస్తూ సంపాదించిన డబ్బుతో జల్సాలు చేస్తూ గ్రామంలో తన పేరు చెప్పుకునేలా చేసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత మాక్లూర్ రప్పించి భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాడు. అప్పటి నుంచి జీవన్‌రెడ్డి పేరు చెప్పి మరిన్ని మోసాలకు తెరతీశాడు. అశోక్ భూమిని విక్రయించగా వచ్చిన రూ. 20 లక్షలతో ఒక కారు, జేసీబీ, టిప్పర్‌ను కొనుగోలు చేసి గ్రామంలో హల్‌చల్ చేశాడు. అశోక్ భూమి విక్రయించుకున్న విషయం బయటపడడంతో బాధితుడు ప్రశాంత్‌ను నిలదీశాడు. దీంతో తన పేరిట చేయించుకున్న లస్మన్న భూమిని అశోక్‌కు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. విషయం తెలియడంతో గ్రామస్తులు దూరంగా పెట్టారు. ఈ క్రమంలో అప్పులు చేసి కొంతకాలం జల్సాలు చేశాడు. కారు, టిప్పర్, జేసీబీల ఈఎంఐలు కట్టకపోవడంతో ఫైనాన్షియర్లు వాటిని తీసుకెళ్లిపోయారు. ఇదే సమయంలో కువైట్‌లో ఉండే ప్రసాద్ తన ఇంటిని విక్రయించాలని ప్రశాంత్‌ను సంప్రదించాడు. ఇదే అవకాశంగా భావించిన ప్రశాంత్ సుమారు రూ. 25 లక్షల విలువ చేసే ఇంటిని తానే కొనుగోలు చేస్తానని నమ్మబలికాడు. తన పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని.. లోన్ తీసుకుని కువైట్ నుంచి రాగానే డబ్బులు ఇస్తానని ప్రసాద్‌కు చెప్పాడు. దీంతో ప్రసాద్ కుటుంబ సభ్యులు ఇల్లును రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చారు.

డబ్బులు ఇవ్వకపోవడం, ఇల్లును తిరిగి రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వకపోవడంతో ప్రసాద్ ప్రశాంత్‌పై ఒత్తిడి చేశాడు. దీంతో ఇల్లును కాజేసేందుకు ప్లాన్ చేసిన ప్రశాంత్ కుటుంబ సభ్యులందరినీ అడ్డు తొలగించుకుంటే అడిగే వారు ఎవరూ ఉండరని భావించి ప్రణాళిక ప్రకారమే ఈ ఘాతుకాలకు పాల్పడినట్లు తెలుస్తోంది.

మాదాపూర్ అడవుల్లో ప్రసాద్ మృతదేహం?

మాదాపూర్ అటవీ ప్రాంతంలో ప్రసాద్ మృతదేహాన్ని పూడ్చిపెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. పోలీసులు ప్రశాంత్‌ను రిమాండ్‌కు తరలించారు. నిందితుడిని పోలీసులు కస్టడీలోకి తీసుకున్న తర్వాత ప్రసాద్ మృతదేహాన్ని తవ్వే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రసాద్ భార్య రమణి మృతదేహం ఎక్కడ ఉందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె మృతదేహాన్ని బాసర గోదావరిలో పడేశారా.. లేదా మరెక్కడైనా పడేశారా అనేది పోలీసులు గుర్తించాల్సి ఉంది. ఇద్దరు చెల్లెళ్లు స్వప్న, స్రవంతి, ఇద్దరు కవల పిల్లలు చైత్రిక్, చైత్రిక మృతదేహాలు లభించాయి.

నిందితుడు జీవన్‌రెడ్డి అనుచరుడు

- సోషల్ మీడియాలో ఫొటోలు వైరల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : కామారెడ్డి, నిర్మల్ జిల్లాలో పదిహేను రోజుల్లో 6 హత్యలకు పాల్పడిన నిజామాబాద్ జిల్లా మాక్లూర్‌కు చెందిన ప్రశాంత్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు కావడం గమనార్హం. నిందితుడు జీవన్‌రెడ్డితో కలిసి గతంలో అనేక సార్లు సన్నిహితంగా ఉన్న ఫొటోలు, ప్రచారంలో జీవన్‌రెడ్డితో కలిసి కీలకంగా పాల్గొన్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రశాంత్ జీవన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో కలిసి దిగిన ఫొటోలు సైతం వైరల్ అవుతుండడం గమనార్హం. ఇదిలా ఉండగా జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుల్లో పలువురిపై గతంలో అనేక కేసులు నమోదు కావడం పట్ల సోషల్ మీడియాలో విస్తృత చర్చ నడుస్తోంది.



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న జీవన్‌రెడ్డి, కవితతో నిందితుడు ప్రశాంత్ దిగిన ఫొటోలు

పోయినోళ్లు తిరిగి రాలేదు..

- చాకచక్యంగా తప్పించుకున్న సుశీల

మాక్లూర్ : పోయినోళ్లు తిరిగి రాలేదని అనుమానం వచ్చింది.. ప్రాణభయంతో లాడ్జి నుంచి తప్పించుకుంది ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురి వరుస హత్య కేసులో హతుడి తల్లి సుశీల.. మాక్లూర్‌కు చెందిన ప్రసాద్ (36) హత్య కేసులో ప్రధాన నిందితుడు ప్రశాంత్ కామారెడ్డి జిల్లా పాల్వంచ నుంచి ప్రసాద్ తల్లి సుశీల, మరో చెల్లెలు స్వప్న, ఇద్దరు పిల్లలను ఈనెల 4న కారులో నిజామాబాద్ తీసు కొచ్చి ఓ లాడ్జిలో ఉంచాడు. అనంత రం ప్రసాద్ పిల్లల్ని చూడాలని అంటున్నాడని చెప్పి సుశీల, స్వప్నలను లాడ్జిలోనే ఉంచి ఇద్దరు పిల్లలను ప్రశాంత్, అతని తమ్ముడు(మైనర్) బయటకు తీసుకుని వెళ్లారు. అనంతరం ఈ నెల 13న లాడ్జి నుంచి స్వప్నను ప్రశాంత్ ఇతర నిందితులు తీసుకెళ్లారు. లాడ్జి నుంచి ప్రశాంత్ వంతుల వారీ గా తన కూతుర్లు, మనమడు, మనమరాళ్లను తీసుకెళ్లి తిరిగి ఒక్కరే రావటంతో సుశీలకు అనుమానం వచ్చింది. ప్రశాంత్‌కు అనుమానం రాకుండా ప్రవర్తించింది. అదును చూసి మంగళవారం లాడ్జి నుంచి తప్పించుకుంది.



“ కఠినంగా శిక్షించాలి

నా కొడుకు ప్రసాద్ ఇంటిని ప్రశాంత్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. తిరిగి తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని ప్రసాద్ అడిగినా చేయలేదు. డబ్బులు అడిగినందుకే నా కొడుకును, కోడలిని, కూతుళ్లను, మనుమడు, మనుమరాలును ప్రశాంత్ హత్య చేశాడు. ఇప్పటికైనా నా కుటుంబ సభ్యుల మృతదేహాలను గుర్తించి అప్పగించాలి. నా కుటుంబ సభ్యులను చంపిన ప్రశాంత్‌తో పాటు మిగతా వారిని కఠినంగా శిక్షించాలి.

–సుశీల, ప్రసాద్ తల్లి

15 రోజుల క్రితం గొడవ

తనకు ఇబ్బందులు ఉన్నాయని.. ఇంటి డబ్బులు చెల్లించాలని ప్రశాంత్‌పై ప్రసాద్ ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రశాంత్ 15 రోజుల క్రితం ప్రసాద్ నివాసం ఉంటున్న మాచారెడ్డి మండలంలోని పాల్వంచ గ్రామానికి వెళ్లి అతనితో గొడవకు దిగినట్లు తెలిసింది. అనంతరం ప్రసాద్ తన తల్లి సుశీలకు ఫోన్ చేసి ప్రశాంత్ తనతో గొడవ పడినట్లు చెప్పాడు. రెండు మూడు రోజులు తర్వాత ప్రసాద్ మాక్లూర్‌కు వచ్చి ప్రశాంత్‌ను డబ్బులు అడిగాడు. అనంతరం తల్లి ఇంటికి వెళ్లి మాచారెడ్డికి వెళ్తున్నానని చెప్పాడు. కానీ ఆ రోజు నుంచి ప్రసాద్ కనిపించకుండా పోయినట్లు సమాచారం. అనంతరం ప్రసాద్‌తో పాటు అతని కుటుంబ సభ్యులను నిందితుడు వరుసగా హతమార్చినట్లు తెలుస్తోంది. సదాశివనగర్‌లోని భూంపల్లిలో స్వప్న హత్య ఘటనను పోలీసులు విచారించడంతో ప్రసాద్ కుటుంబ సభ్యుల వరుస హత్యల ఘటన వెలుగులోకి వచ్చింది.

ఐదుగురి అరెస్టు

ఆరుగురి హత్య కేసులో నిందితులను కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ప్రశాంత్, బానోత్ వంశీ, గుగులోత్ విష్ణులతో పాటు ప్రశాంత్ తమ్ముడు, తల్లిని కూడా అరెస్టు చేశారు. వీరిని రిమాండ్‌కు తరలించారు. ప్రశాంత్ తమ్ముడైన మైనర్‌ను నిజామాబాద్‌లోని జువైనల్ హోంకు తరలించారు.

మాక్లూర్‌లో ప్రశాంత్ ఇల్లు ధ్వంసం చేసేందుకు యత్నం

మాక్లూర్: ఒకే కుటుంబంలోని ఆరుగురిని హతమార్చిన నిందితుడు ప్రశాంత్ ఇంటిని మంగళవారం కొందరు గ్రామస్తులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. నిందితుడు మాక్లూర్ పరువు తీశాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి హంతకులు గ్రామంలో ఉండడానికి వీలు లేదని భావించారు. పోలీసులకు విషయం తెలియడంతో నిందితుడి ఇంటి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి

- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో కలెక్టర్, అర్బన్ ఎమ్మెల్యే



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్ : దివ్యాంగులు ఏ రంగంలోనూ ఎవరికీ తీసిపోరని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే ప్రతిలక్ష్యాన్ని సాధించవచ్చని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించగా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దివ్యాంగులు ప్రదర్శిస్తున్న ప్రతిభాపాటవాలను కొనియాడారు. ఆయా శాఖల్లో ఖాళీల భర్తీ కోసం చేపట్టే ఉద్యోగ నియామకాల్లోనూ దివ్యాంగులకు ప్రత్యేకావకాశాలు కల్పించాలని దివ్యాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరగా సానుకూలంగా కలెక్టర్ స్పందించారు. త్వరలో సదరం సర్టిఫికెట్ల జారీ కోసం స్లాట్ల సంఖ్యను పెంచుతామన్నారు. అనంతరం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు దివ్యాంగులకు అన్నిరంగాల్లో ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయన్నారు. దివ్యాంగులకు అండగా ఉంటానన్నారు. వారికి మౌలిక వసతులు, విద్య, వైద్య సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను కోరారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన, క్రీడా పోటీల్లో విజేతలైన దివ్యాంగులను శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. అలాగే దివ్యాంగులకు సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను సత్కరించారు. చిన్నారుల ప్రదర్శనలు అలరించాయి. జెడ్పీ చైర్మన్ విఠల్ రావు, మేయర్ నీతూ కిరణ్, అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు సూదం లక్ష్మి, డీఆర్డీవో చందర్, డీడబ్ల్యూఓ రసూల్ బీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ పాల్గొన్నారు.

4న అవిశ్వాస తీర్మానంపై సమావేశం

ఆర్మూర్ : ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై అవిశ్వాస తీర్మానం సమావేశాన్ని వచ్చే నెల 4వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహించేందుకు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని 36 మంది కౌన్సిలర్లకు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ భూమేశ్వర్ నోటీసులు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఓటమి పాలు కావడంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లలో చైర్ పర్సన్ వినీత పవన్ దంపతులపై ఉన్న అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. దీంతో వారు తిరుగుబాటు చేసి మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిని ఆశ్రయించి ఆయన సూచన మేరకు మెజారిటీ కౌన్సిలర్లు 24 మంది అవిశ్వాస తీర్మానం పెడుతూ కలెక్టర్‌ను కలిశారు. 24 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అంగీకరిస్తూ సంతకాలు చేసినప్పటికీ రెండు గ్రూప్‌ల బలాబలాలపై స్పష్టత లేదు. మున్సిపల్ చైర్‌పర్సన్ వినీత పవన్ దంపతులు తమ పదవిని కాపాడుకునేందు కు కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

యువత.. పెడదోవ!

- రాజకీయ అండతో చెలరేగిపోతున్న వైనం
- కబ్జాలు, సెటిల్‌మెంట్లు, దోపిడీ, గంజాయి దందాలు
- తాము ఏం చేసినా చెల్లుతుందనే భ్రమ
- తమను ప్రోత్సహిస్తున్న నేతలే కాపాడతారనే ధీమా



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జీవితంలో బాగా చదువుకుని ప్రయోజకులు కావాల్సిన యువత రాజకీయ నాయకుల అండతో పెడదోవ పడుతోంది. నేతల ప్రోద్బలంతో భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు, ఇతరులను మోసగిస్తూ ఆస్తులు కాజేయడం, గంజాయి దందాలకు పాల్పడుతున్నారు. ఇంతటితో ఆగిపోకుండా హత్యలకూ తెగబడుతున్నారు. కొందరు ప్రజాప్రతినిధులు పలువురు యువకులను విచ్చలవిడిగా ప్రోత్సహించడంతో చెలరేగిపోతున్నారు. రాజకీయ పార్టీల్లో చోటామోటా నాయకులుగా చలామణి అవుతూ.. అనేక అవలక్షణాలను అలవర్చుకుని విపరీత ప్రవర్తనతో అడ్డూఅదుపూ లేకుండా వ్యవహరిస్తున్నారు. డబ్బు కోసం, ఆస్తులను కాజేసేందుకు బెదిరింపులకు పాల్పడుతుండడంతో పాటు చివరకు ఎదుటి వ్యక్తులను, సన్నిహితులను సైతం భౌతికంగా నిర్మూలించే విపరీత ప్రవర్తనతో ముందుకెళ్తున్నారు. తామేం చేసినా సరే తమను ప్రోత్సహిస్తున్న కీలకమైన ప్రజాప్రతినిధులు కేసులు లేకుండా చూస్తారనే ధీమాతో విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు.

ఈ క్రమంలో భూకబ్జాలు, ఆస్తులు కాజేయడం, తమ పక్కనే తిరిగేవారినే ఏమార్చి వాళ్ల ఆస్తులనే తాకట్టు పెట్టి డబ్బులు దండుకోవడం, గంజాయి దందా, సెటిల్‌మెంట్లు విచ్చలవిడిగా సాగుతున్నాయి. రాజకీయ అండ ఉంటే చాలు తాము ఏం చేసినా బేఫికర్‌గా ఉండొచ్చనే భ్రమల్లో బతుకుతున్నారు. ఈ క్రమంలో చివరకు రాక్షస ప్రవర్తనతో మనుషులను సైతం హతమార్చేందుకు ఆలోచించడం లేదు. ఇటీవల చోటుచేసుకుంటున్న పలు ఘటనలు ఈ పరిస్థితి అద్దం పడుతున్నాయి.

నేతల అండదండలతో..

రాజకీయ నేతల అండ చూసుకుని కొందరు యువకులు చేలరేగిపోతున్నారు. వారికి అనుచరులుగా ఉంటూ ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. తాము ఏం చేసినా చెల్లుతుందని.. ఏదైనా సమస్య వస్తే తమ వెనుక రాజకీయ నాయకులు ఉన్నారని.. ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఆరుగురి హత్య కేసులో ప్రధాన నిందితుడైన మాక్లూర్‌కు చెందిన ప్రశాంత్.. కీలకమైన ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరుడిగా వ్యవహరిస్తూ వచ్చాడు. ఇదేవిధంగా సదరు మాజీ ప్రజాప్రతినిధికి చెందిన మరో అనుచరుడు తమ గ్రామానికే చెందిన మాజీ సర్పంచ్, ఉప సర్పంచ్‌లను హత్య చేయించేందుకు బీహార్ ముఠాకు రూ. 10 లక్షల సుపారీ ఇచ్చినట్లు గతంలో చర్చ జరిగింది. ఆదేవిధంగా సదరు నేత అండతో పలువురు అనుచరులు పలు మండలాల్లో ఇష్టారాజ్యంగా భూకబ్జాలు చేశారు. పలువురిపై దాడులకు సైతం పాల్పడ్డారు. ఎన్ని చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా.. తమ నాయకుడు అండగా ఉంటాడనే ధీమాతో విచ్చలవిడిగా చలరేగిపోతున్నారు. తమను ప్రశ్నించే వారిపై కేసులు పెట్టించడం, అక్రమాలను, అన్యాయాలను నిలదీసిన వాళ్లను టిప్పర్లతో ఢీకొట్టించి చంపేస్తామని సైతం బెదిరింపులకు పాల్పడిన ఘటనలు కోకొల్లలు ఉన్నాయి. జిల్లాలో గంజాయి దందా కూడా విచ్చలవిడిగా నడుపుతుండడం గమనార్హం. కొన్ని నెలల క్రితం సుపారీ హత్యలకు బీహార్ ముఠాతో ఒప్పందం చేసుకున్న మాజీ ప్రజాప్రతినిధి అనుచరుడిని పోలీసులు అరెస్టు చేసిన సందర్భంలో పెద్దఎత్తున గంజాయి లభ్యం కావడం గమనార్హం. అయినా అతనిపై గంజాయి కేసు నమోదు కాకుండా సదరు నేత మేనేజ్ చేయడం విశేషం. కొత్త ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో చాలా గ్రామాల్లో జరుగుతున్న గంజాయి దందాను కూకటి వేళ్లతో పెకిలించాలని ప్రజలు కోరుతున్నారు.

రేషన్ కార్డులకు మార్గం సుగమం

- ఆరేళ్ల నిరీక్షణకు తెరదించిన కాంగ్రెస్ ప్రభుత్వం
- 28వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- కార్డుల్లో మార్పులకు కూడా అవకాశం
- జిల్లాలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు 77,758

మోర్తాడ్(బాల్కొండ): కొత్త రేషన్ కార్డుల జారీకి కాంగ్రెస్ ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఇదివరకు రేషన్ కార్డు పొందని వారు ఈనెల 28 నుంచి దరఖాస్తులు అందించవచ్చని ప్రభుత్వం నిర్దేశించింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన వారికి రేషన్ కార్డులను జారీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొంది. కొత్త రేషన్ కార్డుల జారీతో పాటు పాత కార్డులలో పేర్ల చేర్పులు, మార్పులకు కూడా అవకాశం కల్పించనున్నారు. 2014, 2018లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రేషన్ కార్డుల్లో పేర్లు మార్చడానికి అవకాశం ఇవ్వలేదు. కొత్తగా పెళ్లి చేసుకుని అత్తారింట్లో అడుగుపెట్టిన యువతులు, పుట్టిన వారి పేర్లు కార్డుల్లో చేర్చాల్సి ఉన్నా చేర్చలేదు. ఎవరైనా చనిపోతే అలాంటి వారి పేర్లను మాత్రం రేషన్ కార్డుల నుంచి తొలగించారు. జిల్లాలో ఇదివరకు జారీ చేసిన రేషన్ కార్డు లు 3,81,224 ఉండగా, 20,940 అంత్యోదయ, 1,061 అన్నపూర్ణ కార్డులున్నాయి. దరఖాస్తులు 77,758 పెండింగ్‌లో ఉన్నాయి.

ఇన్నాళ్లకు ప్రజల పాలనొచ్చింది..

- ఎంపీ, 'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి
- మేయర్ పీఠం కోసం కలిసికట్టుగా పనిచేద్దాం
- అర్బన్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

ఖలీల్‌వాడి : ఇన్నాళ్లకు దొరల పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందని, ఎంపీ ఎన్నికల షెడ్యూల్ ఏ క్షణమైనా రావొచ్చని, కార్యకర్తలు, నాయకులు సిద్ధంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రగతి మున్నూరుకాపు కల్యాణ మండపంలో అర్బన్ కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అందరు కలిసి కట్టుగా ఉండాలని మతతత్వపార్టీలకు, విభజించే పార్టీలకు చరమగీతం పాడాలన్నారు. అర్బన్‌లోని మేయర్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు. అనంతరం మాజీ మంత్రి, అర్బన్ ఇన్‌చార్జి షబ్బీర్‌అలీ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కామారెడ్డి నుంచి అర్బన్ వచ్చానన్నారు. చేనేత కార్మికులకు రూ. 4 వేలు, రూ. 500కే సిలిండర్‌ను అందించాలని నిర్ణయించారన్నారు. జనవరిలో అన్ని గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ప్రజల త్యాగాలతో తెలంగాణ వచ్చిందని, కేసీఆర్‌తో కాదన్నారు. నగరంలో చేపట్టాల్సిన పనులపై ప్రత్యేకంగా సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అన్ని గ్యారెంటీలను వందరోజుల్లోగా అమలుచేస్తామన్నారు. టీపీసీసీ వర్కింగ్‌ప్రసిడెంట్ బొమ్మ మహేశ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల ఆశీర్వాదంతో వచ్చిందని, అర్బన్‌లో కొన్ని అనివార్య కారణాలతో ఓటమి చెందామన్నారు. 17 ఎంపీ స్థానాలు గెలిచిన సోనియాకు గిఫ్ట్ ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవ వేణు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్, తాహెర్ బిన్ హందాన్, గడుగు గంగాధర్, వేణురాజ్, సంతోష్, సయ్యద్‌ఖైసర్ తదితరులు ఉన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

క్లుప్తంగా

మంత్రిని కలిసిన ఘంటా చంద్రశేఖర్



తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను తెయూ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ మంగళవారం సచివాలయంలో మర్యాద పూర్వకంగా మంగళవారం కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. తనకు అత్యంత సన్నిహితుడు, రాష్ట్ర మంత్రి పదవి చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపినట్లు చంద్రశేఖర్ పేర్కొన్నారు.

రెండు గ్రామాల్లో ఇసుక వేలం

బిచ్కుంద(జుక్కల్): అక్రమంగా గుట్టల్లో డంపులు వేసిన ఇసుక కుప్పలకు రెవెన్యూ అధికారులు మంగళవారం ఇసుక వేలం నిర్వహించారు. గోపన్‌పల్లిలో 14, ఖద్‌గాంలో 10 ఇసుక కుప్పలకు వేలం నిర్వహించగా రూ.14,740 ఆదాయం ప్రభుత్వానికి వచ్చినట్లు ఆర్‌ఐ సాయిబాబా తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలి



లింగంపేట: విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు ఉపాధ్యాయులు, సిబ్బందికి సూచించారు. మండలంలోని పోతాయిపల్లి ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వార్షిక, పాఠ్య ప్రణాళిక ఆధారంగా విద్యా బోధన చేయాలన్నారు. అనంతరం పోతాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో తరగతి పాఠ్య బోధనను పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్ రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను తాగి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట సెక్టోరల్ అధికారి వేణు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

యాసంగి సాగేదెలా..?

- ఎస్సారెస్పీ లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల కాని వైనం
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



లక్ష్మి కాలువ హెడ్ రెగ్యులేటర్

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదల ఎప్పుడవుతుందో అని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాసంగి పంటల సీజన్ కోసం కాలువ ద్వారా నీటి విడుదల షెడ్యూల్‌పై అంతా గందరగోళం నెలకొని ఉంది. అధికారులు కాకతీయ కాలువ ద్వారా సోమవారం నుంచి నీటి విడుదల చేపట్టారు. సరస్వతి కాలువ ద్వారా 50 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. కానీ.. లక్ష్మి కాలువ ద్వారా ఇప్పటి వరకు ఎలాంటి నీటి విడుదల ఖరారు కాకపోడంతో ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మైనర్ ఇరిగేషన్ శాఖకు అప్పగింత

ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే లక్ష్మి కాలువ నిర్వహణను గత రెండేళ్ల క్రితం ఎస్సారెస్పీ అధికారుల నుంచి జిల్లా మైనర్ ఇరిగేషన్ శాఖకు అప్పగించారు. ప్రస్తుతం లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదలపై డీఐఏబీ(డిస్ట్రిక్ట్ ఇరిగేషన్ అడ్వయిజర్ బోర్డు) ఆధ్వర్యంలో నిర్ణయం జరగాలి. కానీ ఇప్పటి వరకు బోర్డు సమావేశం ఏర్పాటు కాలేదు. దీంతో నీటి విడుదల ఎప్పటి నుంచి చేపడుతారో తెలియని పరిస్థితి ఉంది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదలను వెంటనే చేపట్టాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వెలవెలబోతున్న లిఫ్టులు..

లక్ష్మి కాలువ ద్వారా నీటి విడుదలచేపట్టక పోవడంతో కాలువ ఆధారంగా నిర్మించిన వేంపల్లి, బోదేపల్లి, చౌటుపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలు నీరు లేక వెలవెల బోతున్నాయి. లక్ష్మి కాలువ ప్రధాన కాలువ 3.4 కిలోమీటర్లు మాత్రమే ఉంది. అక్కడి నుంచి నాలుగు డిస్ట్రిబ్యూటరీలున్నాయి. అందులో మూడవ డిస్ట్రీ బ్యూటరీపై వేంపల్లి, బోదేపల్లి లిఫ్టులు, డీ–4పై చౌటుపల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. కాలువ ద్వారా నీటి విడుదల చేపడితేనే లిఫ్టులకు జల కళ సంతరించుకుంటుంది. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి వెంటనే నీటి విడుదల చేపట్టాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంకా ఖరారు కాలేదు

ప్రాజెక్ట్ నుంచి లక్ష్మి కాలువ ద్వారా ఆయకట్టు యాసంగి పంటలకు నీటి విడుదల ఇప్పటి వరకు షెడ్యూల్ ఖరారు కాలేదు. ఈ నెలాఖరు వరకు ఉంటుందని అనుకుంటున్నాం. డీఐఏబీలో నిర్ణయం అయ్యాక ప్రకటిస్తాం. – సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్, బాల్కొండ

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పోటీలకు ఎంపికైన పల్లికొండ విద్యార్థులు



గుత్ప పాఠశాల విద్యార్థులు



ఎంపికైన రాంచరణ్

భీమ్‌గల్: మండలంలోని పల్లికొండ ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనురాధ మంగళవారం తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో రంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్–17 విభాగంలో రాజు, రవీణ, అండర్–14 విభాగంలో గౌతం రాణ, శివ కీర్తన, సన్నిహిత ఎంపికై నట్లు తెలిపారు. అనంతరం క్రీడాకారులను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుత్ప క్రీడాకారుల ఎంపిక

మాక్లూర్: రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు మండలంలోని గుత్ప ప్రభుత్వ పాఠశాల క్రీడాకారులు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్ మంగళవారం తెలిపారు. రంగారెడ్డిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీలకు ఎంపికై న వారిలో జస్వంత్, నితీశ్, ఓమరేశ్వరి, భార్గవ్, సాత్విక్, అక్షిత ఉన్నారు. అనంతరం క్రీడాకారులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఖోఖో పోటీలకు నందిపేట్ విద్యార్థి

నందిపేట్: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండల కేంద్రంలోని గీతా కాన్వెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థి రాంచరణ్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ గంగాసాగర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు కుమ్రంభీం జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని అన్నారు. అనంతరం విద్యార్థి గంగాసాగర్‌ను కరస్పాండెంట్ గంగాసాగర్, డైరెక్టర్ శోభ, హెచ్ఎం గంగాభూషణ్, పీఈటీలు ముత్యం, సందీప్, సుమలత, ఉపాధ్యాయులు అభినందించారు.

20 నుంచి డైట్ ప్రవేశాలకు కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: డైట్ (డీఈఈ సెట్)లో ప్రవేశాలకు ఈనెల 20 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్‌కు హాజరు కావాలని కోరారు. 22 నుంచి 27 వరకు ర్యాంకు పొందిన ప్రకారం అభ్యర్థులు ఆధారిత కళాశాలలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందని, 30న రిజర్వేషన్, కోర్సుల మెరిట్ రూల్ ఆధారంగా అభ్యర్థులకు సీట్ల కేటాయింపు, జనవరి 1నుంచి 3 వరకు ఫీజు చెల్లింపు, 5న కళాశాలకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుందన్నారు. జనవరి 8న విద్యా బోధన ప్రారంభమవుతుందని వెల్లడించారు.

22న ఎమ్మెల్యే సమీక్ష

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఈనెల 22న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎల్లారెడ్డి నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆర్డీవో మన్నె ప్రభాకర్ మంగళవారం తెలిపారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అన్ని శాఖల అధికారులు నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

‘ఇందిరమ్మ’ ఇళ్లకు కొత్తగా దరఖాస్తులు

- ‘గృహలక్ష్మి’ అప్లికేషన్లను పరిశీలించేది లేదన్న ప్రభుత్వం
- గతంలో ఇచ్చిన ప్రొసీడింగ్‌లు చెత్తబుట్టపాలు

మోర్తాడ్(బాల్కొండ) : పేద, మధ్య తరగతి కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చే క్రమంలో భాగంగా వారి నుంచి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. మరోసారి గ్రామసభల ద్వారా దరఖాస్తులను స్వీకరించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గృహలక్ష్మి పథకం కింద స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించకూడదని ప్రభుత్వ ఆదేశాలు ఇవ్వడం గమనార్హం. ఎన్నికలకు ముందు నియోజకవర్గానికి 3 వేల మందికి గృహలక్ష్మి ప్రొసీడింగ్‌ను జారీ చేశారు. వీటిని అధికార యంత్రాంగం కాకుండా అప్పటి అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులుగా ఎంపికైన వారికి పంపిణీ చేశారు. సొంతంగా జాగా ఉండి ఇళ్లు నిర్మించుకునేవారికి రూ. 3 లక్షల సాయాన్ని మూడు విడతల్లో అందించనున్నట్లు గత ప్రభుత్వం వెల్లడించింది. జిల్లాలో గృహలక్ష్మి పథకం కింద 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ 16,500 మందికి సాయం అందించేందుకు మాత్రమే నిధులున్నాయని పేర్కొంటూ ప్రొసీడింగ్ కాపీలను జారీ చేశారు. కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీవోలు జారీ చేసినట్లు ప్రొసీడింగ్ కాపీలు ఉన్నాయి. వాటిపై ఏ ఒక్క అధికారి సంతకం లేకపోవడం గమనార్హం. కాగా కాంగ్రెస్ పార్టీ మాత్రం గృహలక్ష్మి సాయాన్ని ఇందిరమ్మ ఇళ్ల పథకం సాయానికి తేడాను స్పష్టంగా పేర్కొంది. ఓసీ, బీసీలకు రూ. 5 లక్షల చొప్పున, ఎస్సీ, ఎస్టీలకు రూ. 6 లక్షల చొప్పున సాయం అందించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపికకు మార్గదర్శకాలను జారీ చేసే అవకాశం ఉంది.

కొలతల ప్రకారం పనులు చేయాలి



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో

మాచారెడ్డి: కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తూ ఉపాధి పొందాలని డీఆర్‌డీవో సాయన్న సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం పాల్వంచ మండలం బండరామేశ్వరపల్లి, మాచారెడ్డి మండల కేంద్రంతో పాటు చుక్కాపూర్, ఘన్‌పూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, నర్సరీలను పరిశీలించారు.

కూలీలు సమయ పాలన పాటించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో బాలకృష్ణ, ఏపీవో సాయిబాబు, ఏపీఎం శ్రీనివాస్ ఉన్నారు.

లింగంపేటలో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం

- రెండు గంటల పాటు విరిగిన కాలుతో విలవిలలాడిన విద్యార్థిని
- ఉపాధ్యాయులకు తోటి విద్యార్థులు చెప్పినా పట్టించుకోని వైనం



రఫియాసుల్తానా

లింగంపేట: చదువులు చెప్పే ఆ ఉపాధ్యాయులకు కాలు విరిగి బాధతో విలవిలలాడిన విద్యార్థిని రోదన వినిపించలేదు. తోటి విద్యార్థులు జరిగిన విషయాన్ని విన్నవించినా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో విద్యార్థిని రెండు గంటల పాటు ఇంటికి వెళ్లలేక, విరిగిన కాలుతో నరకయాతన అనుభవించింది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో రఫియా సుల్తానా అనే విద్యార్థిని మూడో తరగతి చదువుతోంది. పాఠశాల గది నుంచి పరుగెత్తుకుంటూ వస్తున్న సమయంలో తోటి విద్యార్థికి తగిలి కింద పడింది. దీంతో రఫియా సుల్తానా కాలు విరిగింది. తోటి విద్యార్థులు తరగతి గదిలో కూర్చోబెట్టి ఉపాధ్యాయులకు చెప్పినా వారు పట్టించుకోలేదని విద్యార్థులు పేర్కొన్నారు. హెచ్ఎం సెలవులో ఉండడంతో ఉపాధ్యాయులందరూ పాఠశాలలో ఉన్నా దెబ్బతో విలవిలలాడిన ఆ విద్యార్థినిని ఎవరూ పట్టించుకోలేదు. సాయంత్రం ఆటల సమయంలో ఓ ఉపాధ్యాయుడు గమనించి విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. ఆస్పత్రికి వెళ్లి పరీక్షించగా కాలు విరిగినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై విద్యార్థిని తల్లిదండ్రులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎంఐఎం అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ పేర్కొన్నారు.

దివ్యాంగుల గుర్తింపు సర్వే

- ఈ నెల 19 నుంచి జనవరి 10 వరకు



ఆర్మూర్‌లో గుర్తించిన దివ్యాంగులతో ఐఈఆర్పీ కిషన్

ఆర్మూర్: జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్ల లోపు ఉన్న దివ్యాంగులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేందుకు సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం చర్యలు చేపట్టింది. ఎస్‌పీడీ దేవసేన, ఏఎస్‌పీడీ రమేశ్, ఐఈ రాష్ట్ర కోఆర్డినేటర్ జోసెఫ్ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించి జిల్లా విద్యాధికారులకు సూచనలు జారీ చేశారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్లు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల్లో 21 రకాల వైకల్యాలతో బాధపడుతున్న దివ్యాంగులను గుర్తించి విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ సైట్‌లో నమోదు చేయనున్నారు. పూర్తి దృష్టిలోపం, తక్కువ చూపు, వినికిడి లోపం, భాషణ, కదలిక వైకల్యం, మెదడు పక్షవాతం, కుష్టు వ్యాధి నయగ్రస్తులు, మరుగుజ్జు, యాసిడ్ దాడి బాధితులు, మస్కులర్ డిస్ట్రోఫీ, బుద్ధి మాంద్యం, నిర్దిష్ట అభ్యసన వైకల్యం, ఆటిజం, మానసిక రుగ్మత, దీర్ఘకాలిక నరాల సమస్య, మల్టిపుల్ స్కెరోసిస్, పార్కిన్‌సన్ వ్యాధి, హిమోఫీలియా, థలసేమియా, సికెల్‌సెల్ వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించాల్సి ఉంటుంది. అందుకుగాను డీఈవో దుర్గా ప్రసాద్, సెక్టోరల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లాలో ఉన్న 50 మంది ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్స్ (ఐఈఆర్పీ)కు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,433 మంది దివ్యాంగులు వివిధ పాఠశాలల్లో చదువుతున్నట్లు గుర్తించారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నందున క్షేత్ర స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ల సహాయంతో దివ్యాంగులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించడానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 19 నుంచి జనవరి 10వ తేదీ వరకు క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. దివ్యాంగులై బడీడు పిల్లలు ఉంటే వారి వివరాలను ప్రబంధ్ పోర్టల్‌లో నమోదు చేసి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ నిర్వహించి సమీపంలోని పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. ఐఈఆర్పీలు గుర్తించిన దివ్యాంగులను హెచ్ఎంలు విధిగా తమ పాఠశాలలో చేర్చుకొని యూడైస్ ప్లస్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.

పాఠశాలల్లో చేర్చుకోవాలి



పాఠశాలలో చదివే విద్యార్థుల్లో వైకల్యాన్ని యూడైస్ ప్లస్‌లో చూపించడంతో పాటు బడీడు దివ్యాంగులను హెచ్ఎంలు విధిగా పాఠశాలల్లో చేర్చుకోవాలి. అందుకు ఐఈఆర్పీలు, సీఆర్పీలు సహకరిస్తారు. – దుర్గా ప్రసాద్, డీఈవో

క్షేత్ర స్థాయిలో సర్వే చేపట్టాలి



భవిత కేంద్రాలను కొనసాగిస్తూ క్షేత్ర స్థాయిలో పూర్తి సర్వే నిర్వహించి దివ్యాంగులను గుర్తించి సంబంధిత సైట్లలో నమోదు చేయించాలి. విద్యార్థులను చేర్చే సమయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి. – శ్రీనివాస్‌రావు, ఐఈ కోఆర్డినేటర్, నిజామాబాద్

పెన్షనర్లకు సమన్యాయం దక్కాలి

- ప్రొఫెసర్ కోదండరాం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

నిజామాబాద్‌నాగారం: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పెన్షనర్లకు సమన్యాయం దక్కాలని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జాతీయ పెన్షన్‌దారుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో పెన్షన్‌దారుల సమావేశం నిర్వహించారు. ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యాలను కల్పించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకు సహాయం చేయడానికి కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. జిల్లాలో ఉద్యమంలో పనిచేసిన కళాకారులను ఆదుకుంటామని అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి పద్మావతిని, ప్రొఫెసర్ కోదండరాంను సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కళాకారులు నేర్నాల కిశోర్, అష్ట గంగాధర్, కర్క రమేశ్ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి, జాతీయ నాయకుడు ఎం.జనార్దన్ రెడ్డి, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, హైకోర్టు అడ్వకేట్ గోపాల్ శర్మ, నాయకులు పోతంకర్ లక్ష్మీనారాయణ, గైని గంగారాం, మధుసూదన్, ప్రసాదరావు, ఈవీఎల్ నారాయణ, హనుమాండ్లు, అందె సాయిలు, లావు వీరయ్య, లక్ష్మీనారాయణ, కళాకారులు బి నవీన్, చిట్టిబాబు, గోదావరి, మహేందర్, ఆంజనేయులు, స్రవంతి, నరేశ్, సాయి బాబు, విజయ్, డప్పు సంతోష్, కలిగోట మహేశ్, గంగాధర్, దత్తురాం, సింధూజ, రాజేశ్, సంజీవ్, మహేశ్‌రెడ్డి, సద్గురు, లింగపురం సాగర్, మోర్తాడ్ రవి తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఒకరి ఆత్మహత్య



పిట్లం(జుక్కల్): కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బండపల్లి తండాలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి ఏఎస్సై లింబాద్రి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన మోతీలాల్(42) వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తుంటాడు. కొన్ని రోజులుగా ఇంట్లో గొడవలు జరుగుతుండడంతో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సుందర్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వివాహిత అదృశ్యం

లింగంపేట: లింగంపేట మండలం బాణాపూర్ గ్రామానికి చెందిన ఓ వివాహిత తన ఇద్దరు కుమారులతో కలిసి అదృశ్యమైనట్లు ఎస్సై ప్రభాకర్ మంగళవారం తెలిపారు. పది రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన వీరు ఇంటికి చేరుకోలేదు. వివాహిత తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వివాహిత, పిల్లల ఆచూకీ తెలిసిన వారు ఎస్సై 8712686162, సీఐ 8712686159 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరి మృతి

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన అశోక్(52) ప్రమాదావశాత్తు చెరువులో పడి మృతిచెందినట్లు ఎస్సై మురళి మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో కూలీ పని చేస్తూ జీవిస్తుంటాడు. కాలకృత్యాలు తీర్చుకోవడానికి గ్రామ శివారులోని కుడి చెరువు వద్దకు వెళ్లిన అశోక్ ప్రమదావశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. మృతుడి భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తిమ్మాపూర్‌లో గొడవ

ఎల్లారెడ్డిరూరల్: ఈత చెట్ల విషయంలో ఇద్దరి మధ్య జరిగిన గొడవలో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు మంగళవారం తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన శ్రీనివాస్‌గౌడ్, ఈశ్వర్‌గౌడ్‌కు ఈత చెట్ల విషయంలో గొడవ జరిగింది. గొడవలో గొడవలో ఈశ్వర్‌గౌడ్ శ్రీనివాస్‌గౌడ్‌పై కత్తితో దాడి చేయడంతో చేతి, ముక్కుపై గాయాలైనట్లు వారు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

సాంఘిక బహిష్కరణపై ఫిర్యాదు



ధర్పల్లి పీఎస్ ఎదుట పద్మశాలీ కులస్తులు

ధర్పల్లి: గ్రామ పెద్దలు తమను బహిష్కరించినట్లు మండలంలోని దుబ్బాక పద్మశాలీ కులస్తులు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని తాళ్లచెరువు సమీపంలోని భూమిని పద్మశాలీ సంఘానికి చెందిన ఓ కుటుంబానికి పట్టా ఉండగా ఆ భూమిని గ్రామానికి ఇవ్వాలని లేదంటే గ్రామంలోని పద్మశాలీ కుల సభ్యులకు సహకరించవద్దంటు గ్రామ కమిటీ సభ్యులు తీర్మానం చేసినట్లు సంఘ సభ్యులు పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామ కమిటీ సభ్యులను వివరణ కోరగా.. గ్రామంలో తాము ఏ సామాజిక వర్గాన్ని బహిష్కరించలేదని తెలిపారు. తాళ్లచెరువు సమీపంలోని భూమిని గ్రామంలోని పశువుల మేత కోసం పూర్వీకుల నుంచి గ్రామం మీద ఉందని అక్కడే పశువులను మేపడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఆలయంలో అభిషేకం టికెట్లు చోరీ

భిక్కనూరు: భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయంలో అభిషేకం టికెట్లు చోరీకి గురైనట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. ఈనెల 16న రాత్రి టికెట్ కౌంటర్‌కు తాళం వేసి వెళ్లగా మరుసటి రోజు టికెట్ల కోసం వెతుకగా కనిపించలేదు. ఆలయ ఈవో శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్..

భిక్కనూరు: మండలంలోని బస్వాపూర్‌లో దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి రాగి కాయిల్స్‌ను దొంగిలించినట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు.

గ్రామానికి చెందిన రైతు సుశీల వ్యవసాయ పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ధ్వంసం చేసి అందులో ఉన్న కాయిల్స్‌ను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని జానకంపేట–నిజామాబాద్ రైల్వేస్టేషన్ మధ్యలో ఎన్‌ఆర్ఐ కాలనీ వద్ద గుర్తు తెలియని వ్యక్తిని రైలు ఢీకొనడంతో మృతిచెందినట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దాడి కేసులో ఒకరికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలోని రైల్వే ఉద్యోగిపై దాడికి పాల్పడిన కేసులో ఒకరికి జైలు శిక్ష పడినట్లు రైల్వే ఎస్సై తావూనాయక్ తెలిపారు. దాడి కేసులో నిందితుడిగా ఉన్న ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లికి చెందిన వడ్లూరి బాలరాజుకు ఆరు నెలలు జైలు శిక్షను విధిస్తూ ఈ నెల 18న రైల్వే రెండో మెట్రోపాలి మెజిస్ట్రేట్ గౌస్‌పాషా తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోజారమణి వాదనలు వినిపించినట్లు తెలిపారు.